లీడర్‌షిప్ అవార్డు అందుకున్న అమిలినేని



యూకేలో అవార్డు అందుకుంటున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 3: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మహాత్మాగాంధీ లీడర్‌షిప్ అవార్డును బుధవారం రాత్రి అందుకున్నారు. లండన్‌లో ఆక్స్‌ఫర్డ్ మేయర్ మైక్ రోలే నుంచి ఆయన అవార్డును స్వీకరించారు. ఎన్‌ఆర్‌ఐ వెల్ఫేర్ సొసైటీ అంబాసిడర్ డాక్టర్ అజిత్ స్వరణ్ సింగ్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. ఎన్‌ఆర్‌ఐ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో యూకేలోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో మహాత్మాగాంధీ జయంతిని నిర్వహించారు. వివిధ రంగాలలో విజయవంతమైన వారికి ఏటా గాంధీజీ పేరిట లీడర్‌షిప్ అవార్డులను అందజేస్తారు. ఈ ఏడాదికి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేనికి అవార్డును ప్రకటించారు. ఎమ్మెల్యేని పలువురు అభినందించారు.

అమ్మోరి వేడుక

నవరాత్రి ఉత్సవాలు ఆరంభం

ప్రత్యేక అలంకరణలు.. పూజలు

దేవీ శరన్నవరాత్రోత్సవాలు జిల్లావ్యాప్తంగా గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తన్మయత్వం పొందారు. కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతను పసుపు, కుంకుమలతో అలంకరించారు. ఆలయ ఆవరణలో సాయంత్రం అన్నపూర్ణాదేవి, శివుడు, మధుర మీనాక్షిగా అలంకరించారు. పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో ఉదయం మహాగణపతి పూజ, వాస్తు, వరుణ పూజలు నిర్వహించారు. గర్భగుడిలో అమ్మవారి మూలవిరాట్‌ను కుంకుమతో అలంకరించారు. ఉత్సవమూర్తిని వారాహిదేవిగా అలంకరించారు. ఐదో రోడ్డు కనకదుర్గ భవానీ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా అలంకరించారు. దుర్గా సప్తశ్తిని పఠించారు. శారదానగర్‌లోని శృంగేరి శారదా శంకరమఠంలో అమ్మవారికి బ్రహ్మీ అలంకారం చేసి పూజలు గావించారు. సాయంత్రం అరవింద నృత్యశిక్షణాలయం చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో అమ్మవారికి నాట్యనీరాజనం పలికారు.

\- అనంతపురం కల్చరల్





పాతూరు అమ్మవారిశాలలో వాసవీమాతకు కుంకుమ అలంకరణ



కొత్తూరులో వాసవీమాతకు పసుపు కుంకుమలతో అలంకారం



యువతుల నృత్యం.. తిలకిస్తున్న భక్తులు



నూతన డీపీఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు

డీపీఓ ప్రభాకర్‌రావు రిలీవ్

బాధ్యతలు చేపట్టిన నాగరాజు నాయుడు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 3: జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు గురువారం రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు డీపీఓగా ఉన్న నాగరాజు నాయుడు బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలు అయనకు అభినందనలు తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని, సమస్యలు తలెత్తకుండా చూస్తామని నాగరాజు నాయుడు అన్నారు. అందరూ సహకరించాలని కోరారు. డీఎల్‌పీఓ సుమన జయంతి, ఏఓ సోమశేఖర్, ఈఓఆర్డీలు వెంకటనాయుడు, ఆనంద్ ప్రసాద్, సదాశివ, దామోదర్‌రెడ్డి, కార్యదర్శులు అశోక్‌కుమార్, చంద్ర, శంకర్, మురళీకృష్ణ, హిదయతుల్లా, మల్లికార్జున, రవీ, అరుణ్, నరేంద్ర, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఓ రిలీవ్

డీపీఓ కార్యాలయ ఏఓ విశ్వనాథ్‌రెడ్డి గురువారం రిలీవ్ అయ్యారు. ఆయన కడప డీఎల్‌పీఓ ఏఓగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ధర్మవరం డీఎల్‌పీఓ నాగరాజు నియమితులయ్యారు. ఆయన శుక్రవారం బాధ్యతలు చేపడతారు.

ప్రశాంతంగా టెట్



చిన్మయ నగర్‌లోని ఎన్‌సీసీఏఐ టెట్ కేంద్రం వద్ద హాల్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

అనంతపురం విద్య, అక్టోబరు 3: టెట్ పరీక్షలు తొలిరోజు గురువారం ప్రశాంతంగా సాగాయి. ఉదయం సెక్షన్‌కు 1235 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1070 మంది హాజరయ్యారు. 165 మంది గైర్హాజరయ్యారు. 86.64 శాతం హాజరు నమోదైంది. ఉదయం 8 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా అనంతలక్ష్మీ ఇంజనీరింగ్ కళాశాలలో అత్యధికంగా 100 మందికిగాను 91 మంది హాజరయ్యారు. అత్యల్పంగా బిట్‌బైటెక్ సొల్యూషన్స్ ఇన్‌స్టిట్యూట్ కేంద్రంలో 160 మందికిగాను 126 మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం సెషన్‌లో ఏడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1075 మంది అభ్యర్థులకు గాను 963 మంది హాజరయ్యారు. 112 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 89.58 శాతం హాజరు నమోదైంది. ఎస్వీఐటీలో 115 మందికిగాను 106 మంది హాజరుకాగా 9 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా గుత్తి గేట్స్ కళాశాల కేంద్రంలో 50 మంది అభ్యర్థులకు గాను 39 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు.

భూముల పరిశీలన పూర్తి చేయండి : కలెక్టర్

అనంతపురం టౌన్, అక్టోబరు 3: అసైన్డ్, ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన 5వ తేదీలోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన ఆర్డీఓ, తహసీల్దార్లు, సర్వేయర్లు, జిల్లా రిజిస్ట్రార్ తదితరులతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 34,485 ఎకరాల భూమి పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ జరిగిన 178,73 ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల వివరాల పునఃపరిశీలన పూర్తి అయిందని అన్నారు. ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కుందుర్పి, పామిడి మండలాలు ఈ ప్రక్రియలో వెనుకబడి ఉన్నాయని, ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజల ఫిర్యాదులను పక్కాగా విచారించి, పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖలో బదిలీ అయినవారు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. బదిలీలలో ఇకపై ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేశారు. సమీక్షలో జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పరిహారం.. మిస్‌మ్యాచ్..!

రైతుల వివరాలు తప్పుగా నమోదు

వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం

13759 మంది రైతులకు రూ.22.11 కోట్లు పెండింగ్

వైసీపీ హయాంలో నష్టం.. కోడ్ సమయంలో పరిహారం



గుత్తి మండలంలో దిగుబడిలేని వేరుశనగ (ఫైల్)

అనంతపురం అర్బన్/శింగనమల, అక్టోబరు 3: వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది తప్పిదాలు రైతులకు శాపంగా మారాయి. రైతుల వివరాలను తప్పుగా నమోదు చేయడంతో వేలాది మందికి పంటనష్ట పరిహారం అందలేదు. బాధిత రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. 2023 ఖరీఫ్‌లో వర్షాభావం కారణంగా జిల్లా రైతులు పంటలను నష్టపోయారు. పరిహారాన్ని ప్రకటించడంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం జాప్యం చేసింది. సార్వత్రిక ఎన్నికల కోడ్‌కు ముందు, ఈ ఏడాది మార్చిలో పంటనష్ట పరిహారాన్ని మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ కారణంగా రైతుల ఖాతాలలో పరిహారం జమ కాలేదు. ఎన్నికల ప్రక్రియ పూర్తైన తర్వాత జమ కావడం మొదలైంది. కానీ కొందరు అధికారులు, సిబ్బంది రైతుల ఆధార్, బ్యాంక్ అకౌంట్ నంబర్లు, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌లు తప్పుగా నమోదు చేశారు. అలాంటి రైతుల వివరాలు మిస్ మ్యాచ్ జాబితాలో పడ్డాయి.

సరిచేసి పంపినా..

2023-24 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 28 మండలాల్లో 1.69 లక్షల మంది రైతులకు పంట నష్ట పరిహారం మంజూరైంది. మొత్తం 1.79 లక్షల హెక్టార్లల్లో పంటకు రూ.251.2 కోట్ల పరిహారం ప్రకటించారు. ఇందులో 13,759 మంది రైతులకు సంబంధించి రూ.22.11 కోట్లు మిస్ మ్యాచ్ జాబితాలో చేరింది. వీరిలో 13506 మంది రైతులకు అందాల్సిన రూ.21.75 కోట్ల మిస్ మ్యాచ్ జాబితాను సరిచేసి జూన్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు పంపారు. మూడు నెలలు గడిచినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇస్తున్నారు.

అకౌంట్ నంబర్ తప్పుగా రాశారు..



సోదనపల్లి పొలంలోని సర్వే నంబర్ 34-డిలో గత ఏడాది వేరుశనగ పంట సాగు చేశాను. పంటనష్టం జాబితాలో రూ.20 వేలకుపైగా పరిహారం మంజూరైంది. నా అకౌంట్ నంబర్‌ను అధికారులు తప్పుగా ఎక్కించడంతో పరిహారం పడలేదు. ఇదే తరహాలో చాలామందికి పరిహారం పడలేదని, త్వరలోనే జమ అవుతుందని అధికారులు చెబుతున్నారు. అందరి వివరాలు సరిచేసి ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు పంపించామని అంటున్నారు. కానీ ఎప్పటిలోగా పరిహారం జమ చేస్తారో చెప్పడం లేదు. త్వరగా పరిహారం ఇప్పించి మమ్మల్ని ఆదుకోవాలి.

\-పెద్ద రంగయ్య, సోదనపల్లి, శింగనమల మండలం

వస్తుందో.. రాదో..



పెద్ద మట్లగొంది రెవెన్యూ పొలం సర్వే నంబర్ 121-1బి, 1సిలో రెండు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. వర్షాలు సరిగా రాక పంట నష్టం జరిగింది. ప్రభుత్వం రూ.18వేలు పరిహారం మంజూరు చేసింది. వ్యవసాయ శాఖ అధికారులు నా బ్యాంకు అకౌంట్ నంబర్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ తప్పుగా నమోదు చేశారు. దీంతో పరిహారం పెండింగ్‌లో పడింది. మిస్ మ్యాచ్ జాబితాలో నా పేరు ఉదని, వివరాలు సరిచేసి పంపించామని అంటున్నారు. ఎప్పుడు అడిగినా త్వరలోనే డబ్బు పడుతుందని చెబుతున్నారు. డబ్బుల కోసం ఎదురుచూస్తున్నాను. పరిహారం జమ చేస్తారో.. లేదో అర్థం కావడం లేదు.

\- జయమ్మ, చిన్నమట్లగొంది, శింగనమల మండలం





నర్సు భర్త ఇంజెక్షన్..?

ఆస్పత్రిలో రోగి మృతి.. కుటుంబ సభ్యుల ఆందోళన



మృతదేహంతో వైద్యశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్, సీపీఐ నాయకులు



కుళ్లాయప్ప మృతదేహం

నార్పల, అక్టోబరు 3: నర్సుకు బదులుగా ఆమె భర్త ఇంజెక్షన్ వేయడంతో నార్పల బెల్దార్ కాలనీకి చెందిన కుళ్లాయప్ప(38) మృతిచెందాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి స్థానిక ప్రాథమిక వైద్యశాల వద్ద ఆందోళనకు దిగారు. కుళ్లాయప్పకు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో గురువారం తెల్లివారుజామన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో వైద్యశాలలో సిబ్బంది లేరని, నైట్ డ్యూటీలో ఉన్న నర్సు (ఎఫ్ఎన్ఓ) భర్త ఇంజెక్షన్ వేశాడని, ఆ వెంటనే వాంతులై కుళ్లాయప్ప మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతదేహంతో వైద్యశాల వద్ద ఎమ్మార్పీఎస్, సీపీఐ నాయకులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. అయితే ఇంజెక్షన్ తానే వేశానని, తనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తన భర్త తోడుగా వచ్చారని ఎఫ్ఎన్ఓ అక్షిత తెలిపారు. తన భర్త ఇంజెక్షన్ వేయలేదని ఆమె అన్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. ఇంజెక్షన్ ఎవరు వేశారో నిర్ధారించేందుకు సీసీ ఫుటేజీ కోసం ప్రయత్నించారు. కానీ ఆస్పత్రిలో సీసీ కెమెరాలు పనిచేయలేదని తేలింది. శింగనమల సీఐ కౌలుట్లయ్య మృతుని భార్య దేవి నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బందిని సీఐ విచారించారు. కుళ్లాయప్ప కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు పుల్లప్ప, సీపీఐ మండల కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేశారు. కుళ్లాయప్ప మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కుళ్లాయప్పకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారని, వారిని ప్రభుత్వమే రెసిడెన్షియల్ పాఠశాలలో చదివించాలని, ప్రభుత్వం రూ.20 లక్షలు తక్షణ సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై విచారిస్తున్నామని, ఇంజెక్షన్ వేసింది నర్సు కాదని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి ఆలం నరసానాయుడు ఫోన్‌లో పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

డ్వామా పీడీకి లైన్ క్లియర్

6న బాధ్యతల స్వీకరణ



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 3: డ్వామా పీడీగా సలీం బాషా ఈనెల 6న బాధ్యతలు చేపట్టనున్నారు. డీఆర్‌డీఏ-వెలుగు కర్నూలు పీడీగా పని చేస్తున్న ఆయనను జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ పీడీగా పనిచేస్తున్న వేణుగోపాల్ రెడ్డిని మాతృశాఖ జైళ్ల డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి డ్వామా ఏఓ విజయలక్ష్మి ఇన్‌చార్జి పీడీగా ఉన్నారు. ఈ క్రమంలో ఆమెను గుంతకల్లు డీఎల్‌డీఓగా బదిలీ చేశారు. డ్వామాలో ఎఫ్ఎంగా పనిచేస్తున్న వెంకటనాయుడును ప్రకాశం జిల్లా డీపీఓగా బదిలీ చేశారు. ఏఓ, ఎఫ్ఎం పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఎవరు..?

డీఆర్‌డీఏ-వెలుగు ఇన్‌చార్జి పీడీ ఓబులమ్మను కడప జెడ్పీ సీఈఓగా బదిలీ చేశారు. రెగ్యులర్ పీడీగా ఉన్న నరసింహారెడ్డిని డోన్ డీఎల్‌డీఓగా బదిలీ చేశారు. రెగ్యులర్ పీడీగా ఎవరినీ నియమించలేదు. దీంతో ఇన్‌చార్జి పీడీ రిలీవ్ అవుతారా లేక కొనసాగుతారా అనే సందిగ్ధత నెలకొంది. కడప జెడ్పీ సీఈఓగా బదిలీ అయిన ఓబులమ్మ అక్కడికి వెళ్లేందుకు సుముఖంగా లేరని, డీఆర్‌డీఏ-వెలుగు పీడీగానే కొనసాగుతారనే ప్రచారం జరుగుతోంది. మూడు నెలలుగా డ్వామా, డీఆర్‌డీఏ-వెలుగు శాఖలలో స్తబ్దత నెలకొంది. పీడీల నియామకంలో జాప్యం జరగడంతో కార్యకలాపాలు సక్రమంగా సాగడం లేదు. డీఆర్‌డీఏ-వెలుగులో ఉద్యోగుల బదిలీ జరిగినా.. సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని.. బదిలీలను మార్చే యోచనలో ఉన్నారు. డ్వామాలో మాత్రం ఉద్యోగుల బదిలీలు చేపట్టలేదు. ఆ శాఖ ఉద్యోగులకు బదిలీల ఫీవర్ పట్టుకుంది.



సాలువ వంశస్థుల శాసనం లభ్యం

● చరిత్రకారుడు మైనాస్వామి



శాసనాన్ని చూపుతున్న మైనాస్వామి

గోరంట్ల, అక్టోబరు 3: సాలువ వంశస్థుల అరుదైన శాసనం లభించిందని చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. విజయనగర (హంపి) సామ్రాజ్యాన్ని పాలించిన రెండవ రాజవంశం సాలువ పాలకులు చాలుక్య వంశ వారసులన్న చారిత్రక అంశాన్ని ఆయన వివరించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లలోని మాధవరాయ ఆలయం ముందున్న రాతి బండపై చెక్కిన అరుదైన శాసనం గురించి ఆయన గురువారం విలేకరులతో మాటాడ్లారు. శ్రీమాధవరాయస్వామి సేవలకు భూదానమిస్తూ శాసనాన్ని సాలువ నరసింగరాయులు రాయించారన్నారు. శాసనకర్తపేరు శ్రీమాన్ నరసింగభూపతిరాయ అని ఉండగా మేదిని మీసరగండ, కటారి వంటిబిరుదులున్నాయని వివరించారు. మొదట చంద్రగిరి తరువాత పెనుకొండ సీమ రాజప్రతినిధిగా పనిచేసిన సాలువ 1485 నుంచి 1491 వరకు విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. సాలువ వంశావళి శాసనం 34 వరసల్లో లిఖించబడిందని తెలియజేశారు. సంస్కృత శాసనాన్ని, సుందరమైన తెలుగులో రాశారన్నారు. శాసనం పైభాగంలో సుదర్శన చక్రం, సూర్యుడు, చంద్రుడు, శంకు చిత్రాలున్నాయని, హంపి నుంచి నెల్లూరు జిల్లా ఉదయ్‌గిరి, తమిళనాడులోని కడులూరు వరకు ఉన్న అనేక శాసనాల్లో వంశప్రసక్తి ఎక్కడ కనిపించలేదన్నారు. ఈ శాసనాన్ని భద్రంగా పరిరక్షించుకోవాలని మైనాస్వామి విజ్ఞప్తి చేశారు.

ఎంపీ అంబికాకు అరుదైన అవకాశం

లేబర్, టెక్స్‌టైల్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నియామకం

అనంతపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణకు కేంద్ర ప్రభుత్వంలో అరుదైన అవకాశం లభించింది. తొలిసారి ఎంపీగా ఎన్నికైన ఆయనకు కేంద్ర ప్రభుత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీలో చోటు లభించింది. బసవరాజు బొమ్మై చైర్మన్‌గా ఉన్న కమిటీలో అంబికా లక్ష్మీనారాయణను సభ్యులుగా నియమించారు. లోకసభ సభ్యులు 21 మంది, రాజ్యసభ సభ్యులు 10 మంది ఉన్న ఈ కమిటీలో అంబికాకు స్థానం దక్కింది. కాగా ఇప్పటికే ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర ఓబీసీ, స్కిల్ బోర్డు సంక్షేమ సభ్యులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపీ అంబికా ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తొలిసారిగా ఎంపీగా ఎన్నికైన తనను అటు ఓబీసీ, స్కిల్ బోర్డు సంక్షేమ సభ్యులుగా నియమించడంతో పాటు లేబర్, టెక్స్‌టైల్స్ స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీలోనూ సభ్యుడిగా స్థానం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు.

ప్రైవేటు మద్యం షాపులకు దరఖాస్తులు నిల్

దరఖాస్తు విధానంపై వ్యాపారులకు వివరించిన అధికారులు



దరఖాస్తు విధానంపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

అనంతపురం అర్బన్, అక్టోబరు 3: జిల్లావ్యాప్తంగా ప్రైవేటు మద్యం షాపులకు ఇప్పటి దాకా ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. ఈనెల 1వతేదీ నుంచి జిల్లాలోని 10 ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. గురువారం మూడో రోజు అన్ని స్టేషన్ల పరిధిల్లో పలువురు వ్యాపారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే పద్ధతిపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలు, సిబ్బంది ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు ఎలా చేసుకోవాలి..? ఆఫ్‌లైన్‌లో ఏవిధంగా పద్ధతులు పాటించాలన్న విషయంపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఆఫ్‌లైన్ పద్ధతిలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పేరుపై ఒక్కో దరఖాస్తు రుసుం (నాన్‌రీఫండబుల్) రూ.2 లక్షలు డీడీ తీయాలని ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ మునిస్వామి, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. డీడీతోపాటు తగిన డాక్యుమెంట్లను స్థానిక ఎక్సైజ్ స్టేషన్లల్లో అందజేస్తే, ఆయా ఎక్సైజ్ స్టేషన్లల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తారన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో నేరుగా వ్యాపారులే దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈనెల 9వతేదీ వరకు దరఖాస్తుకు గడువు ఉందని, అవకాశాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుంతకల్లు మీదుగా సికింద్రాబాద్-వాస్కో ఎక్స్‌ప్రెస్

గుంతకల్లు, అక్టోబరు 3: ప్రయాణికుల డిమాండ్‌ను అనుసరించి సికింద్రాబాద్-వాస్కోడగామా మధ్య (వయా గుంతకల్లు) బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న ఈ రైలుకు ఈనెల 6వ తేదీన సింగిల్ ట్రిప్ ఇనాగురల్ స్పెషల్ రన్ నడపనున్నట్లు తెలియజేశారు. ఈరైలు ఆరవ తేదీన సికింద్రాబాద్‌లో ఉదయం 11-45 గంటలకు బయలుదేరి కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుంతకల్లు (సాయంత్రం 6-15కు), బళ్లారి, హోస్పేట, కొప్పల్, గదగ్, హుబ్లీ, ధార్వాడ, లోండా, క్యాస్టల్ రాక్, కులేం, శాన్వోర్డెం, మడ్గావ్ చర్చోరెం మీదుగా మరుసటి రోజు ఉదయం 7-20 గంటలకు వాస్కోడగామా స్టేషన్‌కు చేరుకుంటుందన్నారు. ఈరైలు (నం. 17039) ఈ నెల 9వ తేదీ నుంచి బుధ, శుక్రవారాలలో సికింద్రాబాద్‌లో ఉదయం 10-05 గంటలకు రెగ్యులర్‌గా బయలుదేరి సాయంత్రం 5-05 గంటలకు గుంతకల్లుకు చేరి, మరుసటి రోజు ఉదయం 5-45 గంటలకు వాస్కోకు చేరుకుంటుందని తెలియజేశారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17040) ఈనెల 10వ తేదీ నుంచి గురు, శనివారాల్లో వాస్కోడగామా స్టేషన్‌లో ఉదయం 9 గంటలకు బయలుదేరి గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు రాత్రి 8-40 గంటలకు వచ్చి, మరుసటిరోజు ఉదయం 6-20 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుందన్నారు. ఈ రైలుకు రిజర్వేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు రైల్వే అధికారులు వివరించారు.

అహుడా వైస్ చైర్మన్‌గా జేసీ బాధ్యతలు

అనంతపురం క్రైం, అక్టోబరు 3: జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మకు అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అహుడా) వైస్ చైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్‌ఏసీ) అప్పగించారు. ఇదివరకు వైస్ చైర్మన్‌గా పనిచేసిన మురళీకృష్ణగౌడ్‌ను సీడీఎంఏ కార్యాలయానికి బదిలీ చేయగా ఆయన రిలీవ్ అయ్యారు.

చీనీ నిరాశ..!



మార్కెట్‌కు వచ్చిన చీనీ దిగుబడులు (ఫైల్)

ఈ సీజన్‌లో ఆదాయం అంతంతే
ప్రారంభంలో బాగున్నా తరువాత పడిపోయిన ధరలు
ఎగుమతి ప్రాంతాల్లో వర్షాలే ప్రధాన కారణం
మార్కెట్ ఆదాయానికి సైతం గండి

అనంతపురంరూరల్/ గార్లదిన్నె, అక్టోబరు 3: చీనీ రైతులకు నిరాశే మిగులుతోంది. ప్రకృతి వైపరీత్యాలు ఒక వైపు, గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. దాదాపుగా చీనీ సీజన్ ముగుస్తోంది. అయితే ఈ సీజన్ చీనీ సాగు రైతులకు పెద్దగా కలిసిరాలేదని చెప్పవచ్చు. మార్కెట్‌కు సైతం ఉత్పత్తులు తక్కువగా రావడం.. ఆదాయం కూడా ఆశించిన స్థాయిలో లేదని తెలుస్తోంది.

తగ్గిన ధరలతో నష్టం

జిల్లాలో 96వేల ఎకరాల్లో చీనీ పంటను సాగుచేశారు. ఇందులో 70వేల ఎకరాల్లో కాపు ఉంది. పంట దిగుబడి ఐదు ఎకరాలకు 25 నుంచి 30 టన్నుల మధ్య సాధారణంగానే ఉంటోందని రైతులు అంటున్నారు. అయితే ముగిసిన సీజన్‌లో ఆ పరిస్థితి లేదని చెబుతున్నారు. 20 టన్నులు దిగుబడికి మించి రాలేదని రైతులు అంటున్నారు. అంతంతమాత్ర ధరలతో నష్టపోయామంటున్నారు. సీజన్ ప్రారంభంలో కొంత బాగున్నా ఆ తరువాత ఉత్పత్తులకు సంబంధించి ఎగుమతి ప్రాంతాల్లో వర్షాల కారణంగా ధరలు తగ్గిపోయాయి. దీంతో నష్టపోయినట్లు రైతులు పేర్కొంటున్నారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టామని, ఆదాయం ఆశించిన స్థాయి కంటే తక్కువగా వచ్చిందని రైతులు అంటున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది సీజన్‌లో ఎక్కువగా నష్టపోయామని వివరిస్తున్నారు.

మార్కెట్‌కు తక్కువగా దిగుబడులు

సాధారణంగా చీనీ సీజన్ ప్రతి ఏటా జనవరి నుంచి అక్టోబరు వరకు ఉంటుంది. ఆగస్టు వరకు బాగా ఉండి క్రమేణా దిగుబడులు తగ్గుతూ వస్తాయి. ప్రతి ఏడాది లాగా ఈయేడు కూడా అనంతపురం వ్యవసాయ మార్కెట్‌కు ఉత్పత్తులు వచ్చాయి. అయితే చాలా వరకు తగ్గాయి. దీనికి ప్రధాన కారణం దిగుబడులు తగ్గడమేకాకుండా పులివెందుల మార్కెట్‌కు ఉత్పత్తులు కొంతమేర వెళ్లడం స్థానిక మార్కెట్‌పై ప్రభావం చూపిందని సంబంధిత వర్గాలు అంటున్నాయి. దీనికితోడు పులివెందుల మార్కెట్‌లో బహిరంగ వేలం నిర్వహించడం. ఇక్కడ ఈనామ్ పద్ధతిలో నిర్వహించడం ఒక కారణమన్న అభిప్రాయమూ వినిపిస్తోంది. గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది సీజన్‌లో మార్కెట్‌కు కాయలు తగ్గడంతో పాటు మార్కెట్ ఆదాయానికి సైతం కొంత గండి పడింది. 2022-23లో 87,485 టన్నుల ఉత్పత్తులు రాగా.. యూజర్ చార్జీల రూపంలో రూ.1.81కోట్లు ఆదాయం వచ్చింది. అదేవిధంగా 2023-24లో 1,08,085 టన్నులు రాగా రూ.1.90కోట్లు మార్కెట్‌కు ఆదాయం సమకూరింది. ప్రస్తుత సీజన్‌లో 2024-25లో 94,989టన్నులు రాగా 1.61కోట్ల ఆదాయం వచ్చింది. మార్కెట్‌కు రూ.30లక్షల మేర ఆదాయం తగ్గింది.

ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు



ఐదు ఎకరాల్లో 600 చెట్లు ఉన్నాయి. ఈసారి ఆరేడు లక్షలకు పైగా పెట్టుబడి రూపంలో పెట్టాను. అయితే ఆశించిన స్థాయిలో దిగుబడులు మాత్రం రాలేదు. మొత్తంగా రూ. పది లక్షల వరకు దిగుబడుల రూపంలో వచ్చింది. దీనికితోడు గత ఏడాది గైరంగాలు టన్ను రూ.40వేలతో అమ్ముడుపోయాయి. ఈయేడు రూ.20వేలు పలికాయి. ధర సగానికి సగం పడిపోయింది. ఇలా అయితే రైతులు అప్పుల పాలుకావాల్సిందే.

- చిదంబరప్ప, రైతు, పెనకచర్ల గ్రామం

ధర బాగుంటే ఆదాయం వచ్చేది..



ఎనిమిది వందల చీనీ చెట్లున్నాయి. రూ.ఆరు లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. దిగుబడి అంతంతమాత్రమే. మొత్తంగా రూ.11లక్షల వరకు దిగుబడి వచ్చింది. గత ఏడాది గైరంగాలు టన్ను రూ.43వేలతో విక్రయించాం. ఈసారి రూ.18వేలు పలికాయి. ధర బాగుండుంటే రూ.18లక్షల వరకు ఆదాయం వచ్చేది. ఆ పరిస్థితి లేకుండా పోయింది.

- బాలకృష్ణ, రైతు, గార్లదిన్నె

కొంత తగ్గాయి..



గత సీజన్ కంటే ఈసారి కొంత మేర మార్కెట్‌కు చీనీ దిగుబడుల రాక తగ్గింది. సీజన్ మధ్యలో ఉత్పత్తులు ఎగుమతి అయ్యే ప్రాంతాల్లో ఎక్కువగా వర్షాలు కురవడం, పులివెందుల మార్కెట్ ప్రారంభం కావడం వంటి కారణాలతో మార్కెట్‌కు దిగుబడులు రాలేదు. ఆదాయం కూడా తగ్గింది.

- గోవిందు, ఎంపికశ్రేణికార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ యార్డు, అనంతపురం

తల్లిని మోసం చేసిన తనయుడు

డబ్బు డ్రా అంటూ ఆస్తి రాయించుకున్న ఘనుడు
ఆస్తిలో సగం ఇవ్వమన్నందుకు తల్లిపై దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగమణి

విడపనకల్లు, అక్టోబరు 3: నవమాసాలు మోసిన తల్లిని ఓ తనయుడు మోసం చేశాడు. డబ్బులు డ్రా చేయాలంటూ ఆస్తి పత్రాలపై సంతకం చేయించుకున్నాడు. తెలుసుకున్న తల్లి ఆస్తిలో సగమైనా ఇవ్వమన్నందుకు ఆమెపై దాడి చేసి గాయపరచి పరారయ్యాడు. తనకు జరిగిన అన్యాయంపై ఆ తల్లి రోదిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన కరముక్కల గ్రామంలో గరువారం చోటు చేసుకుంది. కరముక్కల గ్రామానికి చెందిన నాగవేణి, ఈశ్వరయ్య దంపతులు. వారికి ఇద్దరు సంతానం. 13 సంవత్సరాల క్రితం ఈశ్వరయ్య మృతి చెందాడు. ఆయన మృతి అనంతరం కుమార్తె సంగీతకు సింధనూరుకు చెందిన సుగరయ్యతో వివాహం చేసింది. ఇందుకుగాను రూ. 15 లక్షల వరకు అప్పు చేసింది. అయితే బ్యాంకులో డబ్బులు డ్రా చేయాలని తల్లి చేత సంతకం చేయించి 22 ఎకరాల భూమిని తనపేరు మీద చేయించుకున్నాడు కుమారుడు అశోక్. విషయం తెలుసుకున్న తల్లి అందులో 10 ఎకరాలన్నా తనకు ఇవ్వాలని విన్నవించుకుంది. అడిగిన ప్రతిసారీ ఆమెను కొట్టడం, ఇంటి నుంచి గెంటేయడం చేసేవాడు. ఈ నేపథ్యంలో ఆమె కూతురు వద్దకు వెళ్లి ఉంటోంది. గురువారం మరోమారు కుమారుడి వద్దకు వచ్చి ఆస్తి ప్రస్తావన తీసుకువచ్చింది. దీంతో ఆగ్రహం చెందిన అశోక్ ఆమెపై దాడిచేయి గాయపరిచాడు. చేయి విరగడంతో అశోక్ అక్కడి నుంచి పరారయ్యాడు. నాగవేణి తనకు జరిగిన అన్యాయంపై ఉవరకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రాణంతీసిన నిర్లక్ష్యం..!

పురం ఆస్పత్రిలో శిశువు మృతి
డాక్టర్ నిర్లక్ష్యంతోనే అంటున్న బాధితులు
వేడుకున్నా స్పందించలేదంటూ ఆవేదన



బాలింత మైథిలి



మైథిలి తల్లి రాధమ్మ

హిందూపురం అర్బన్, అక్టోబరు 3: స్థానిక జిల్లా ఆస్పత్రిలో గురువారం ఉదయం పసికందు మరణించాడు. హిందూపురం మండలం మేళాపురం ప్రాంతానికి చెందిన మైథిలి ప్రసవవేదనతో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆస్పత్రికి వచ్చింది. వైద్యులు పరీక్షించి, అడ్మిట్ చేసుకున్నారు. ఆ తరువాత నొప్పులు తీవ్రమయ్యాయి. మైథిలి నొప్పులు భరించలేకపోతోందని సిజేరియన్ చేయాలని ఆమె తల్లి రాధమ్మ.. పలుమార్లు డ్యూటీలో ఉన్న నర్సులను వేడుకుంది. వారు పరిస్థితిని ఆన్‌డ్యూటీ డాక్టర్ నందితకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. రిపోర్టులను వాట్సాప్‌కు పంపారు. దానిని బట్టి ఆమె నార్మల్ డెలివరీ అవుతుందనీ, నొప్పులు సహజమేననీ, భరించాలని వైద్యురాలు చెప్పినట్లు బాధితులు పేర్కొన్నారు. నార్మల్ అయితే మంచిదేగా అని గర్భిణిని తల్లి ఓదార్చుతూ వచ్చింది. గురువారం ఉదయం 7.30 గంటలకు డాక్టర్ నందిత వచ్చి మైథిలిని ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్లారు. సిజేరియన్ చేసి, ఆడబిడ్డను బయటకు తీశారు. అప్పటికే హార్ట్ బీట్ తక్కువ ఉండటంతో పాప చనిపోయి ఉందని వైద్యులు చెప్పడంతో బాధితులు ఆవేదనకు లోనయ్యారు. నార్మల్ అవుతుందని చెప్పిన వైద్యులు.. సిజేరియన్ ఎందుకు చేశారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. బుధవారమే చేసి ఉండుంటే బిడ్డ బతికి ఉండేదని వాపోయారు. రిపోర్టుల ప్రకారం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు చెప్పారనీ, సడన్‌గా పాప హార్ట్‌బీట్ ఎలా తగ్గిందని మండిపడుతున్నారు. రాత్రంతా బాధపడుతుంటే ఒక్కసారైనా డాక్టర్ రాలేదనీ, నర్సులే పరీక్షిస్తున్నారని ఆగ్రహించారు. నిర్లక్ష్యంతోనే బిడ్డ చనిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విచారణ చేపడుతున్నాం: డేవిడ్‌రాజ్, ఆర్ఎంఓ

ఆస్పత్రిలో శిశువు మృతి చెందిన విషయం వాస్తవమే. దీనిపై విచారణ చేపడుతున్నాం. తల్లి, బిడ్డ క్షేమంగానే ఉన్నారనీ, సిజేరియన్ తరువాత బిడ్డ హార్ట్‌బీట్ తగ్గిందని డాక్టర్ నందిత పేర్కొన్నారు. ఇందులో వైద్యుల నిరక్ష్యం లేదు.

పాసుపుస్తకం ఇప్పించండి సారూ..

తహసీల్దార్ కాళ్లు పట్టుకున్న రైతు



పాసుపుస్తకం కోసం తహసీల్దార్‌ను వేడుకుంటున్న రామలింగప్ప

మడకశిర రూరల్, అక్టోబరు 3: తన భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించాలని తహసీల్దార్ కాళ్లను రైతు పట్టుకున్నాడు. స్థానిక కార్యాలయంలో గురువారం తహసీల్దార్ కరుణాకర్ కాళ్లపై మండలంలోని గుద్దిలిపల్లికి చెందిన రైతు రామలింగప్ప పడ్డాడు. రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామలింగప్ప కుటుంబీకులకు గంగుళవాయిపాళ్యం పంచాయతీ పరిధి సర్వే నంబరు 170పైకి 11.44 ఎకరాల భూమి ఉంది. అందులో రామలింగప్పకు 1.24 ఎకరాలు ఉంది. ఇది పిత్రార్జితం. దీనికి సంబంధించి వన్‌బీ ఉంది. బ్యాంకులో రుణం కూడా తీసుకున్నాడు. అందులో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఐదేళ్లుగా ఆ భూమి వివరాలు రెవెన్యూ రికార్డుల్లో లేవు. మరొకరి పేరుతో పాసుపుస్తకాలు ఇచ్చారని రైతు వాపోయాడు. తన భూమిని రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించి, పాసుపుస్తకం ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరాడు. పెనుకొండలో ఆర్డీఓకి కూడా సమస్య విన్నవించుకున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం తహసీల్దార్‌గా కరుణాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కలిసి రికార్డులను చూపించి, న్యాయం చేయాలని కోరాడు. అంతవరకు కదిలేదిలేదని కార్యాలయం వరండాలో కూర్చున్నాడు. న్యామం చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతు వెనుదిరిగాడు.

రికార్డులను పరిశీలించి, న్యాయం చేస్తాం

- కరుణాకర్, తహసీల్దార్, మడకశిర

ఇక్కడ తహసీల్దార్‌గా గురువారమే బాధ్యతులు తీసుకున్నా. రికార్డులను పరిశీలించి, మూడు రోజుల్లోగా న్యాయం చేస్తాం.

ఎంబీఏ, ఎంసీఏకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 3: ఎస్కేయూలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ నరసింహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసెట్-2024 కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటా ప్రవేశాల ప్రక్రియ ముగిసిందని, మిగిలిపోయిన సీట్లను భర్తీచేసేందుకు స్పాట్ అడ్మిషన్స్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు శనివారం నిర్వహించే స్పాట్ అడ్మిషన్స్‌కు సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని కోరారు. ఐసెట్‌లో ర్యాంకులు సాధించిన వారే అర్హులని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ పొందేవారికి ప్రభుత్వ ఫీజురీయింబర్స్‌మెంట్ రాదని ప్రవేశం పొందిన రోజే కోర్సు ఫీజు చెల్లించాలని తెలిపారు.

జీడిపల్లికి 882 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 3: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 882 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 842 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.636 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆరంభం

అనంతపురం అర్బన్, అక్టోబరు 3: సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం మొదలైంది. తొలి రోజు జిల్లావ్యాప్తంగా 789 మంది రైతులు 1280 క్వింటాళ్ల పప్పుశనగ కోసం తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. పప్పుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు.

రేపు పీఎం కిసాన్ సొమ్ము విడుదల

అనంతపురం అర్బన్, అక్టోబరు 3: పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్‌ను పురస్కరించుకొని శనివారం ప్రధాని నరేంద్రమోదీ ఈ ఏడాది రెండో విడతకు సంబంధించిన పీఎం కిసాన్ సొమ్మును విడుదల చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 27,9,161 మంది రైతులకు ఒక్కో రైతుకు రూ.2వేలు చొప్పున రూ.55.83 కోట్లను నేరుగా డీబీటీ ద్వారా ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు.

టమోటా కిలో రూ.77

అనంతపురంరూరల్, అక్టోబరు 3: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.77తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 630 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.67, కనిష్ఠ ధర రూ.51పలికినట్లు ఆయన తెలిపారు.

ఒక్క వానకే..!



గుల్జార్‌పేట్‌లో..



శ్రీకంఠం సర్కిల్‌లో...



ఆర్టీసీ బస్టాండ్ వద్ద..



టవర్‌క్లాక్ వద్ద..

చాలా రోజుల తరువాత భారీ వర్షం..! ఎప్పటిలాగే అనంతపురం నగరం జలమయమైంది. క్లాక్ టవర్, ఆర్టీసీ బస్టాండు, గుల్జార్‌పేట్, శ్రీకంఠం సర్కిల్, రాజు రోడ్డు.. ఇలా అన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు.. మురుగు నీరు ఏకమై రోడ్లను ముంచెత్తాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్క వానకే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక రోజుల తరబడి కురిస్తే ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. నగర పాలకులు, అధికారులు సమస్య ఎక్కడుందో గుర్తించి.. పరిష్కరించాలి. భారీ వర్షానికి నగరంలో గురువారం రాత్రి పవర్ కట్ చేశారు. దీంతో జనం అంధకారంలో ఉండాల్సి వచ్చింది. పుట్లూరు, కూడేరు, బుక్కరాయసముద్రం, పామిడి, విడపనకల్లు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. శింగనమల, గుంతకల్లు, నార్పల మండలాల్లో జల్లులు పడ్డాయి.

- అనంతపురం అర్బన్

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శేషవాహనంపై ఆర్‌ఎఫ్ రోడ్డులోని వెంకటేశ్వరస్వామి

అనంతపురం కల్చరల్, అక్టోబరు 3: కలియుగదైవం, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారకు విశేష పూజలు నిర్వహించారు. అంకురార్పణ, పవిత్ర గరుడ పతాకావిష్కరణ, అమ్మవార్లు స్వామి మూలవిరాట్‌లకు వివిధ అభిషేకాలు, కుంకుమార్చనలు, తోమాలసేవ, అలంకారసేవ నిర్వహించారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం వివిధరకాల పుష్పాలతో అలంకరించిన శేషవాహనంపై శ్రీవారిని ఆశీనులను చేసి ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

అర్బన్‌బ్యాంకులో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న డీసీఓ అరుణకుమారి, చైర్మన్ జేఎల్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 3: స్థానిక అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో సుభాష్‌రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయభవన్‌లో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభించారు. మొదటి రోజు గురువారం బాలా త్రిపురసుందరి అవతారంలో ఉన్న అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బ్యాంకు మరింత అభివృద్ధి సాధించి, పేదలకు సేవలను విస్తృతం చేయాలని అమ్మవారిని ప్రార్థించినట్లు డీసీఓ తెలిపారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక, నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ విజయభాస్కర్, వైస్ చైర్మన్లు వడ్డే వెంకటాద్రి, గోల్డ్ బాషా, డైరెక్టర్లు రమణయ్య, రొళ్ల భాస్కర్, కృష్ణకుమార్, చంద్రశేఖర్, సుంకర రమేష్, విశ్రాంత మేనేజర్ లోకనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ

గార్లదిన్నె, అక్టోబర్ 3: స్థానిక ఎంపీడీఓగా యోగానందరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గార్లదిన్నె ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న విజయ్‌భాస్కర్ ముదిగుబ్బకు వెళ్లారు. ఆయన స్థానంలో పుట్లూరు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న యోగానందరెడ్డి గార్లదిన్నెకు వచ్చారు. ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి శుభకాంక్షలు తెలిపారు. మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, ఏఓ బాబాపక్రుద్దీన్, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, కోఆర్డినేటర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: స్థానిక ఎంపీడీఓగా ఆజాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఎంపీడీఓ ఆజాద్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే పరిటాల సునీత సహకారం, ఇతర అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతానన్నారు.

ఆత్మకూరు : స్థానిక ఎంపీడీఓగా లక్ష్మీనరసింహస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కుందుర్పి ఎంపీడీఓగా ఉన్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా కార్యాలయ పరిపాలనాధికారి శివశంకర్ బాధ్యతలు నిర్వహించారు. మండలంలో అభివృద్ధి పనులకు తనవంతు సహకారం అందిస్తామని బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ తెలిపారు. ఆయనకు టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, మండల నాయకులు వెంకటేశులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా శ్రీధర్ బాధ్యతలు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు3: ఆర్‌డబ్లూఎస్ రాప్తాడు డివిజన్ డీఈగా శ్రీధర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు డీఈగా ఉన్న రెహనా వసీం గుత్తికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో పులివెందుల నుంచి డీఈగా శ్రీధర్ నియమితులయ్యారు. దీంతో ఆయన బాధ్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో అభివృద్ధికి తమవంతు చర్యలు చేపడతామన్నారు. ఎక్కడ ఎలాంటి లోపాలకు తావులేకుండా చూస్తామన్నారు.

ఏబీవీపీ ప్రాంత సభ్యుడిగా హరిప్రసాద్ నాయక్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 3: ఏబీవీపీ ప్రాంత సభ్యుడిగా తనను నియమించినట్లు హరి ప్రసాద్ నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజవాడలో 12న నిర్వహించిన జనజాతి విద్యార్థుల సమ్మేళనంలో తనను నియమించారని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ అనంతపురం ప్రతినిధిగా పోరాటాలు చేసినందుకు గుర్తించడం ఆనందనంగా ఉందని ఈ సందర్భంగా హరిప్రసాద్ నాయక్ పేర్కొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు : డీఎస్పీ

శింగనమల, అక్టోబరు 3: మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమంగా ఇసుక తరలిస్తే ఎంతటి వారినేనా ఉపేక్షించేదిలేదని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆయన బుధవారం శింగనమల పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో క్రైం వివరాలు, రికార్డులు ఇతర కేసులుపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా రాత్రి సమయంలో ఇసుక రవాణా చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ కౌలుట్లయ్య పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర కమిటీ ఏర్పాటు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 3: రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఆర్‌ఈఎఫ్) రాష్ట్ర నూతన కమిటినీ ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, కార్యకలాపాల విస్తరణకు నూతన కమిటీని నియమించామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ రామచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎండీ నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా జీఎల్ఎస్ రవికుమార్ (విశాఖపట్నం), ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, అధికార ప్రతినిధిగా లింగన్న (కర్నూలు), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగేశ్వరరావు (విజయవాడ), కార్యదర్శిగా బాబాఫక్రుద్దీన్ (విశాఖపట్నం), ట్రెజరర్‌గా జయరాం ఎంపికయ్యారన్నారు. అలాగే గౌరవ అధ్యక్షురాలిగా సీతామహాలక్ష్మి(విశాఖపట్నం), స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా ప్రత్యూష సుబ్బారావు (గుంటూరు), కోచైర్మన్‌గా సురేష్‌బాబు, లీగల్ సెల్ క న్వీనర్‌గా వెంకటేశ్వర్లు(గుంటూరు) ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 9న ఆర్‌ఈఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కమి టీని అధికారికంగా ప్రకటించనున్నట్టు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.



శంకరమఠంలో బ్రాహ్మిణి అలంకారంలో శారదామాత



శివబాలయోగి ఆశ్రమంలో భరతమాతగా అనంతేశ్వరి



మొదటిరోడ్డు చౌడేశ్వరి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

శ్రీమాత్రేనమః

మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం ఆవరణలో ఉన్న శారదా శంకరాచార్యుల దేవాలయంలో వేడుకల ప్రారంభం సందర్భంగా ఉదయాన్నే కలశపూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి దీక్షా బంధనం గావించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అమ్మవారి ఉత్సవ మూర్తిని హంసవాహనంపై ఆశీనులనుచేశారు. బ్రాహ్మణీదేవిగా అలంకరించి పూజలు గావించారు. రామచంద్రనగర్‌లోని షిర్డిసాయి ఆలయంలో దుర్గామాతను బాలాత్రిపురసుందరిగా అలంకరించి పూజించారు. బెంగళూరు రోడ్డులోని శివకోటి ఆలయంలో శివకామేశ్వరి మాతను అన్నపూర్ణేశ్వరి అలంకారం చేసి, ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. అనంతరం భక్తులు సామూహిక కుంకుమార్చన, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఐదోరోడ్డులో నల్లమల సుంకలమ్మ ఆలయంలో బాలా త్రిపురసుందరిదేవిగా, పాతూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బాలా త్రిపుర సుందరిదేవి అలంకారం, అశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయంలో బాలాత్రిపురసుందరిగా అలంకరించారు. శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో అమ్మవారిని భరతమాతగా అలంకరించారు. అలాగే తపో వనంలోని వేదమాత గాయత్రిదేవి ఆలయం, ఐదో రోడ్డులోని రేణుకా యల్లమ్మ, హెచ్చెల్సీ కాలనీలోని చాముండేశ్వరి, మొదటిరోడ్డు రేణుకా యల్లమ్మ, గుత్తి రోడ్డులోని రేణుకా యల్లమ్మ ఆలయాల్లోనూ అమ్మ వారిని రకరకాల రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు.

-అనంతపురం కల్చరల్



శివకోటి ఆలయంలో అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారు

గాలి, వడగండ్ల వాన బీభత్సం

- ఎగిరిపోయిన దుకాణాల రేకులు
- దెబ్బతిన్న పంటలు, నేలకొరిగిన విద్యుత్‌స్తంభాలు
- నష్టపోయిన రైతులు



సీకేపల్లిలో కూలిన దుకాణం, ఎగసిపడిన రేకులు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 3: మండలకేంద్రంలో బుధవారం రాత్రి ఈదురు గాలి, వడగండ్లవాన బీభత్సం సృష్టించాయి. వాటి ధాటికి పలు పంటలు దెబ్బతినడంతో రైతులకు తీవ్రంగా నష్టం కలిగింది. రేకుల దుకాణాలు, షెడ్లు, విద్యుత్‌స్తంభాలు పలు చెట్లు నేలకొరిగాయి. సీకేపల్లి జాతీయ రహదారి పక్కన గ్రామానికి చెందిన ఆంజనేయులు, రాధాక్రిష్ణ ఏర్పాటు చేసుకున్న రేకుల దుకాణాలు తీవ్రమైన గాలుల ధాటికి రహదారి అవతల ఉన్న లేఔట్లలోకి ఎగిసిపడ్డాయి. దీంతో అంజనేయులుకు చెందిన సరుకులు, రేకుల బంక్ పూర్తిగా దెబ్బతిని దాదాపు రూ.80వేలు, రాధాక్రిష్ణకు రూ.40 వే ల వరకు నష్ట సంభవించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్లు, అక్కడక్కడ చెట్లు కూడా నే లకొరిగాయి. దీంతో స్థానికంగా విద్యుత్‌అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో సి బ్బంది గురువారం ఉదయం మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

దెబ్బతిన్న పంటలు: గాలివాన బీభత్సానికి స్థానికంగా పలువురు రైతులు సాగుచేసిన పంటలు దెబ్బతిన్నారు. రైతలకు నష్టాన్ని మిగిల్చాయి. ప్రధా నంగా టమోట, గోరుచిక్కుడు పంటలకు నష్టం వాటిల్లింది. జేబీ నరసిం హులు రెండెకరాల్లో, అమరేంద్రరెడ్డి రెండెకరాలు, నాగేంద్ర రెండున్నర ఎకరా, బన్యాల సూర్యనారాయణ ఒకటిన్నర ఎకరాల్లో సాగుచేసిన టమోట పంట దెబ్బతిందని ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా దామోదర్‌రెడ్డి, కుళ్లాయరెడ్డిలతో పాటు మరికొందరు రైతులకు చెందిన గోరుచిక్కుడు పంటకు కూడా నష్టం వాటిల్లింది. కాగా మండలంలో పలు గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా, పలువురు రైతులు తొల గించిన వేరుశనగపంట తడిసి ముద్దైంది. దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.





పొలాల్లో నేలకొరిగిన విద్యుత్‌స్తంభం, దెబ్బతిన్న టమోటా పంట

జాతీయ రహదారిపై కారు ప్రమాదం

- ఎస్‌ఐ చొరవతో కుటుంబం సురక్షితం



రహదారిపై ప్రమాదానికి గురైన కారు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 3: జాతీయ రహదారిపై జరిగిన కారు ప్రమాదంలో చిక్కుకు పోయిన ఓ కుటుంబాన్ని సీకేపల్లి ఎస్ఐ సత్యనారాయణ ప్రత్యేక చొరవతో సురక్షితంగా కాపాడారు.. స్థానికులు, పోలీసు సిబ్బంది తెలిపిన మేరకు... అనంతపురానికి చెందిన ఓ కుటుంబసభ్యులు ఐదుగురు కారులో చిక్‌బళాపూర్‌కు వెళ్తున్నారు. వాళ్లలో ఓ చిన్నారి ఉంది. అయితే గురువారం 1-30గంటల సమయంలో ఎన్ఎస్‌గేటు జాతీయ రహదారి జంక్షన్ వద్ద వారు వెళ్తున్న కారు ప్రమాదవ శాత్తు డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదం జరిగిన సమయంలో భారీ వర్షం కురుస్తుండటంతో వారు కారులో నుంచి బయటకు రాలేని పరిస్థితి. ప్రమాదం జరిగి తాము ఆపదలో ఉన్నట్టు వారు పెనుకొండ సీఐకి ఫోన్‌ద్వారా వారు తెలియజేశారు. ఆయన వెంటనే సీకే పల్లి ఎస్ఐ సత్యనారాయణకు చేరవేశారు. వెంటనే ఎస్ఐ సత్యనారాయణ చొరవ తీసుకుని వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. తమ సిబ్బందిని అక్కడికి పంపి కారులో ఉన్నవారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చి పోలీసు జీపులోకి చేర్చారు. అనంతరం కారును డివైడర్‌లో నుంచి బయటకు తీసి వారిని అక్కడి నుంచి సురక్షితంగా పంపి వేశారు. దీంతో వారు ఎస్ఐకి, పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ వీ రత్న ఎస్ఐని అభినందించారు.

'సీపీఐ నుంచి ఎవరూ బీజేపీలో చేరలేదు'

అనంతపురం విద్య, అక్టోబరు 3 : నగరంలో రాణినగర్ నుంచి సీపీఐ నాయకులు ఎవరూ బీజేపీలో చేరలేదని, వారివి బోగస్ ప్రకటనలని సీపీ ఐ నాయకులు కొట్టిపారేశారు. ముఖ్యంగా రాణి నగర్‌లో ఉంటున్న వడ్డే ఉప్పు శ్రీనాథ్‌కు సీపీఐతో ఎలాంటి సంబంధం లేదని సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు పేర్కొన్నారు. సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన ఇతర నాయకులతో కలసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. వడ్డే ఉప్పు శ్రీనాథ్‌తో కలసి సీపీఐ శ్రేణులు ఇటీవల బీజేపీలో చేరినట్టు కొందరు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. అయితే సీపీఐ పార్టీ కార్యకర్తలు రాణినగర్ నుంచి బీజేపీలో చేరలేదన్నారు. శ్రీనాథ్ తండ్రి, వారి తమ్ముడికి సీపీఐలో సభ్యత్వం ఉందని, అయితే శ్రీనాథ్‌కు సీపీఐతో ఎలాంటి సభ్యత్వం లేదన్నారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తమ పార్టీ గురించి ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు.

శిక్షణ కార్యక్రమాలతో విద్యార్థులకు మేలు

అనంతపురం రూరల్, అక్టోబరు3: శిక్షణ కార్యక్రమాలతో విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం సాధిస్తారని ఐసీటీ రాష్ట్ర అధ్యక్షుడు దినకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆలమూరురోడ్డులో ఉన్న ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో గురువారం బెస్ట్ ప్రోగ్రాం ఇన్ ప్రీమియర్ బ్యాంకర్ అనే అంశంపై ఇన్ఫోసిస్ కంపెనీ, ఐసీటీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీటీ రాష్ట్ర అధ్యక్షుడు దినకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. తద్వారా ఉపాధి కల్పన లభిస్తుందన్నారు. తమ సంస్థ ద్వారా దేశ వ్యాప్తంగా 48వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తోందని, రాయ లసీమలో మొట్టమొదటి సారిగా ఈ కళాశాలలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఐటీసీ, ఇన్ఫోసిస్ సంస్థలు సంయుక్తంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తాయని ఆయన తెలిపారు. ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ, సీఈఓ ఆనందరావ్, ప్రిన్సిపాల్ అరుంధతి, డైరెక్టర్ రామిరెడ్డి, ప్రోగ్రాంకో ఆర్డినేటర్ మల్లిరెడ్డి, ఐసిటి రాయలసీమ రీజినల్ మేనేజర్ ప్రవీణ్‌కుమాంర్ తదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ రంగంలో వేగవంతమైన మార్పులు

- ఎస్కేయూ ఈసీఈ విభాగాధిపతి ఆంజనేయులు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 3: కమ్యూనికేషన్ సేవలు విస్తరించేందుకు నెట్‌వర్క్ రంగంలో వేగవంతైన మార్పులు వస్తున్నాయని ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్(ఈసీఈ) విభాగాధిపతి డాక్టర్ ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం అనంలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగంలో 'ఇన్నోవేషన్స్ అండ్ ఫ్యూచర్ డైరెక్షన్స్ ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్స్‌త' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కళాశాల హెచ్ఓడీ అజయకుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సెమినార్‌కు డాక్టర్ ఆంజనే యులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ రామమూర్తి, డీన్ రాయుడు, అధ్యాపకులు ఖాదర్‌బాష, నవీన్‌కుమార్, అరుణకుమారి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు : కమిషనర్

అనంతపురం క్రైం, అక్టోబరు 3 : విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని నగర కమిషనర్ నాగరాజు అధికారులను హెచ్చరించారు. ఆయన గురువారం తన చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కోర్టు కేసులకు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ వెం కటేశ్వర్లు, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, ఆర్ఓలు సతీష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆవులను తరలించండి

నగరంలో ఆవులు సంచరిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నగరానికి దూరంగా తరలించాలని కమిషనర్ యజమానులకు సూచించారు. ఈనెల 10వతేదీలోగా తరలించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి

- ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆందోళన



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, అక్టోబరు 3 : సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి ఆధ్వర్యంలో బుధవారం తరగతులు నడుపుతున్న పులు కార్పొరేట్ కళాశాలల వద్దకు వెళ్లి, నిరసన తెలిపారు. తరగతు లను బంద్ చేయించారు. తర్వాత వారు మాట్లాడుతూ... ఈనెల 13వ తేదీ వరకు విద్యా సంస్థలకు సెలవులు ఇచ్చారన్నారు. యాజమాన్యాలు సెలవుల్లో కూడా తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చేలా ఆర్ఐఓ, ఇతర అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వంశీ, మంజునాథ్, పవన్, కార్తీక్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏడీకి ఏబీవీపీ నాయకుల వినతి: రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు దసరా పండుగ సెలవులు ఇస్తే.... అనంతపురంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ప్రత్యేక తరగతులు నిర్వహించడం తగదని, వారిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు ఏడీని కోరారు. వారు బుధవారం ఏడీ క్రిష్ణయ్యను కలిశారు. ఆ సంఘం విభాగ్ కన్వీనర్ అఖిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఏడీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ కమల్, భూతరాజు, సుధీర్ పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తేనే అధిక దిగుబడి

- 'పొలం పిలుస్తోంది'లో జిల్లా వ్యవసాయాధికారి

రాప్తాడు, అక్టోబరు 3: పంటల సాగులో మెలకువలు పాటిస్తేనే అధిక దిగుబడి సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. రాప్తాడు సమీపంలోని పొలంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ... పంటలకు సకాలంలో మందులు పిచికారీ చేయాలన్నారు. తెగుళ్లను నివారిస్తేనే సానుకూల దిగుబడులు వస్తాయన్నారు. ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, డీహెచ్ఓ నరసింహులు, డీఎస్ఓ ఆంజినేయులు, ఉద్యానశాఖ జేడీ దేవమునిరెడ్డి, ఉద్యానశాఖ అధికారి రత్నకుమార్, ఏడీఏ రవి, ఏఓ శేఖర్‌రెడ్డి, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: మండలంలోని ఆలమూరు, కట్టకిందపల్లి గ్రామాల్లో వ్యవసాయాధికారులు గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఏఓ శశికళ హాజరై పంటల సాగు, చీడపీడల నివారణ గురించి రైతులకు వివరించారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన కంది ఇతరత్రా పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి, వ్యవసాయ విస్తరణాధికారి, ఉద్యాన విస్తరణాధికారి, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎగుమతులను మరింతగా ప్రోత్సహించాలి

- ఉద్యాన శాఖ జేడీ దేవమునిరెడ్డి

అనంతపురం అర్బన్, అక్టోబరు 3: జిల్లా నుంచి అరటి, ఇతర రకాల ఉద్యాన పంటల ఎగుమతులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఉద్యాన శాఖ జేడీ దేవమునిరెడ్డి ఆదేశించారు. స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణాకేంద్రంలో గురువారం పండ్ల సంరక్షణపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడు తూ.. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు అరటి, ఇతర రకాల పంట ఉత్ప త్తుల ఎగుమతులను పెంచేందుకు తగిన ప్రణాళికలు రూపొందించి, ఆ మేరకు ముందుకు వెళ్లాలన్నారు. అరటి ఫ్రూట్ కేర్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల న్నారు. ఎగుమతి చేసే సమయంలో అరటి ఉత్పత్తులు దెబ్బతినకుండా చూసుకోవాలన్నారు. అలాగే పండ్ల సంరక్షణపై రైతులకు ఉద్యాన శాఖ ద్వారా శిక్షణనిచ్చే విధంగా చూడాలని కంపెనీ ప్రతినిధులు కోరారు. ఈ జిల్లా ఉద్యాన అధికారి నరసింహారావుతోపాటు అనంత, నంద్యాల, కడప జిల్లాల ఉద్యాన అధికారులు, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీయూలో రక్తదాన శిబిరం

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 3: సెంట్రల్ యూనివర్సిటీలో గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 75మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా కొండన్న బాధ్యతల స్వీకరణ

రాయదుర్గం రూరల్‌, అక్టోబరు 3: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నూతన ఎంపీడీఓగా ఎం కొండన్న గురువారం బాధ్యతలు చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం ఎంపీడీఓగా ఉన్న ఆయన సాధారణ బదిలీలలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఈఓఆర్డీ రంగనాయకులు కళ్యాణదుర్గంరూరల్‌కు బదిలీపై వెళ్లారు.

ఎంఈఓగా మహమ్మద్‌ గౌస్‌

కూడేరు, అక్టోబరు 3: మండల విద్యాధికారిగా మహమ్మద్‌ గౌస్‌ గురువారం మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఎంఈఓగా ఉన్న చంద్రశేఖర్‌ గత నెల 17న ఓ ప్రైవేటు పాఠశాల వారితో లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌ హ్యాండెడ్‌గా దొరకడంతో ఉన్నతాధికారులు సస్పెండ్‌ చేశారు. అప్పటి నుంచి ఆ స్థానం ఖాళీగా ఉంది. దీంతో అనంతపురం పట్టణంలోని నంబర్‌ వన్‌ స్కూల్‌ హెచ్‌ఎం మహమ్మద్‌ గౌస్‌ను ఎంఈఓగా ఇక్కడికి పంపారు.

ఎక్సైజ్‌ సీఐగా ఉమాబాయి

కణేకల్లు, అక్టోబరు 3: ఎక్సైజ్‌ స్టేషన్‌ నూతన సీఐగా ఆర్‌ ఉమాబాయి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి ఈమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా ఉన్న మురళీకృష్ణ కొడికొండ చెక్‌పోస్టుకు బదిలీ అయ్యారు. అలాగే ఎక్సైజ్‌ ఎస్‌ఐగా షెక్షావలి కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా వాయల్పాడు నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా ఉన్న ప్రభాకర్‌రావు శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకు బదిలీ అయ్యారు.

మున్సిపల్‌ ఏఈగా నరసింహులు

రాయదుర్గం రూరల్‌, అక్టోబరు 3: రాయదుర్గం మున్సిపాలిటీ కార్యాలయంలో ఏఈగా పీ నరసింహులు గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా కర్నూలు జిల్లా గూడూరు మున్సిపాలిటీ నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శ్యామ్‌రాయ్‌

బొమ్మనహాళ్‌, అక్టోబరు 3: మండలకేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్‌గా శ్యామ్‌రాయ్‌ బాధ్యతలు స్వీకరించారు. గత కొంత కాలంగా డిప్యూటీ తహసీల్దార్‌ స్థానం ఖాళీగా ఉండడంతో కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయం నుంచి శ్యామ్‌రాయ్‌ను నియమించారు. అలాగే రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న సుజాత శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో లక్ష్మీకాంత్‌నాయక్‌ బాధ్యతలు తీసుకున్నారు.

హౌసింగ్‌ ఏఈగా గోపీచంద్‌నాయక్‌

వెలుగుప్ప, అక్టోబరు 3: మండలకేంద్రంలో హౌసింగ్‌ నూతన ఏఈగా గోపీచంద్‌ నాయక్‌ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన విడపనకల్లు మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో ఏఈగా ఉన్న శివారెడ్డి అనంతపురం నగరానికి బదిలీపై వెళ్లారు.

వీఆర్వోల బదిలీ

బొమ్మనహాళ్‌, అక్టోబరు 3: మండలంలో ముగ్గురు వీఆర్వోలు బదిలీ అయినట్లు తహసీల్దార్‌ మునివేలు తెలిపారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏళంజి వీఆర్వో హరిప్రసాద్‌ రాయదుర్గం మండలం నాగిరెడ్డిపల్లికి, ఉంతకల్లు వీఆర్వో వన్నూర్వల్లి రాయదుర్గం పట్టణానికి, బొమ్మనహాళ్‌ వీఆర్వో తిమ్మప్ప రాయదుర్గం మండలం చదం గ్రామానికి బదిలీ అయినట్లు వెల్లడించారు.

వీరశైవ మహాసభకు తరలిరండి

కణేకల్లు, అక్టోబరు 3: జిల్లా కేంద్రంలో ఈనెల 5వ తేదీన అఖిలభారత వీరశైవ మహాసభ జరుగుతుందని, జిల్లాలోని వీరశైవ లింగాయతులంతా పెద్దఎత్తున తరలిరావాలని ఆ సంఘం జాతీయ కార్యదర్శి సజ్జయ్య వేలూరు మరియప్ప కోరారు. మండలకేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. అనంతపురంలోని కాన్వెంట్‌ ఫౌండేషన్‌ స్కూల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు మహాసభ జరుగుతుందని తెలిపారు.

కేటీఎస్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తనిఖీ

రాయదుర్గం రూరల్‌, అక్టోబరు 3: పట్టణంలోని కేటీఎస్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఉన్నత విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్‌ నాగలింగారెడ్డి గురువారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ చాంబర్‌లో ప్రిన్సిపాల్‌తో, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. అధ్యాపకులు బోధనలో ఎటువంటి పద్ధతులు పాటిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. బోధనా సిబ్బంది ఎప్పటికప్పుడు అవసరమైన రికార్డులను అప్డేట్‌గా ఉంచుకోవాలని సూచించారు. న్యాక్‌ సందర్శనకు వచ్చే ప్రక్రియ ఏ దశలో ఉన్నది అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు మంచి గ్రేడ్‌ రావడానికి అవసరమైన శ్రమ చేయాలని సూచించారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

కూడేరు, అక్టోబరు 3: మండలంలోని ఉదిరిపికొండ గ్రామంలో గురువారం తాగునీటిని ట్యాంకర్లతో సరఫరా చేశారు. గత కొంత కాలంగా గ్రామంలో తాగునీటి కష్టాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఇటీవల జరిగిన గ్రామ సభలో స్థానికులు పలువురు తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. దీంతో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామని గ్రామకార్యదర్శి శివరంజని హామీ ఇచ్చారు. ఈ మేరకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

గుండెపోటుతో వైస్‌ ఎంపీపీ మృతి

యల్లనూరు, అక్టోబరు 3: మండల వైస్‌ ఎంపీపీ రంగయ్య గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈయన వైసీపీ తరఫున శింగవరం ఎంపీటీసీ సభ్యుడిగా గెలుపొంది, వైస్‌ ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఈయన స్వగ్రామం నీర్జాంపల్లి. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. రంగయ్య మరణవార్త విని టీడీపీ, వైసీపీ నాయకులు గ్రామానికి చేరుకునిమృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

విశ్వేశ్వరాలయంలో పూజలు

గుంతకల్లు టౌన్‌, అక్టోబరు 3: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి అనుబంధమైన కాశీవిశాలాక్షి సమేత విశ్వేశ్వర ఆలయంలో గురువారం శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు ఆలయంలోని స్వామికి, అమ్మవారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాయదుర్గంరూరల్‌, అక్టోబరు 3: పట్టణ సమీపంలోని ఎంపీఎస్‌ కాలేజీ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని ఆర్‌బీ వంక గ్రామానికి ఆంజనేయులు భార్య జయలక్ష్మి, మరిదిపల్లికి నరసింహులుతో కలిసి ద్విచక్రవాహనంపై రాయదుర్గం నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. కాగా ఎంపీఎస్‌ కాలేజీ సమీపంలోకి రాగానే కెంతాపల్లికి చెందిన రాజు మరో బైక్‌లో వెళ్తూ ముందు వెళ్తున్న వీరి బైక్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆంజనేయులు, జయలక్ష్మితో పాటు రాజుకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ఉరవకొండలో స్వర్ణ కవచ అలంకరణలో చౌడేశ్వరీదేవి



గుత్తిలో ప్రత్యేకలంకరణలో వాసవీ అమ్మవారు



తాడిపత్రిలో బాలాత్రిపుర సుందరీదేవిగా పార్వతీదేవి



రాయదుర్గంలో శైలపుత్రి అలంకరణలో పార్వతీదేవి



బెళుగుప్ప మండలం తగ్గపర్తిలో స్వర్ణకవచాలంకృత దేవిగా తగ్గపర్తమ్మ

మాతా.. నమోనమః

● ఘనంగా ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

● అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● వివిధ అలంకరణల్లో అమ్మవార్ల దర్శనం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్‌: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల వ్యాప్తంగా అన్ని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లోని అర్చకులు ఉదయాన్నే అమ్మవార్ల మూలవిరాట్‌లకు వివిధ అలంకారాలు చేసి ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. అలాగే లలితా సహస్ర పారాయణం చేశారు. అదిశ ఆలయాల్లో బాలాత్రిపురసుందరి దేవిగా అమ్మవార్లు దర్శనమిచ్చారు. భక్తులు భారీగా తరలివచ్చి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు పొందారు.

జేసీపీఆర్‌ రాకతో తాడిపత్రి జనసంద్రం



గుత్తి శివారులో జేసీపీఆర్‌కు ఘనస్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు



జేసీకి స్వాగతం పలకడానికి వెళ్తున్న పుట్లూరు మండల శ్రేణులు

● రెండునెలల తర్వాత అడుగుపెట్టిన మున్సిపల్‌ చైర్మన్‌

● భారీ కాన్వాయ్‌తో స్వాగతం పలికిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

తాడిపత్రి/ యాడికి: అక్టోబరు3: మున్సిపల్‌ చైర్మన్‌ జేసీ ప్రభాకర్‌రెడ్డి రాకతో గురువారం తాడిపత్రి పట్టణం జనసంద్రమైంది. హైదరాబాద్‌ నుంచి ఆయన దాదాపు రెండునెలల తర్వాత తాడిపత్రికి రావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బాణసంచాతో ఘన స్వాగతం పలికారు. ముందుగా గుత్తిపట్టణం సమీపంలో ఉన్న బాట సుంకులమ్మ ఆలయం వద్దకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వెళ్లి భారీ కాన్వాయ్‌ నడుమ తండ్రికి ఘనంగా స్వాగతం పలికారు. జేసీపీఆర్‌ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులతో కలిసి జేసీపీఆర్‌ బాటసుంకులమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత భారీ కాన్వాయ్‌తో తాడిపత్రికి బయలుదేరారు. మధ్యలో యాడికి మండలం రాయలచెరువులో ఆయనకు స్థానిక టీడీపీ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, వేలూరు రంగయ్య, పరిమి చరణ్‌, మాదాల అనిల్‌, నాగముని రెడ్డి, నరసింహులు, దేవేంద్ర, రామాంజనేయులు, సుదాకర్‌నాయుడు, కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతి పట్టారు. కొద్దిసేపు అక్కడి నాయకులతో ముచ్చటించిన ఆయన తిరిగి వేములపాడు, ఇగుడూరు, చుక్కలూరు, సజ్జలదిన్నె క్రాస్‌ మీదుగా తాడిపత్రి పట్టణ సరిహద్దుల్లోకి వచ్చారు. అంతకుముందే వేలాదిగా చేరుకున్న కార్యకర్తలు, అభిమానులు గజమాలతో ఘనస్వాగతం పలికారు. జేసీపీఆర్‌ తన వాహనం పైకి ఎక్కి అందరికీ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. జూనియర్‌ కళాశాల మైదానంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి గజమాలతో స్వాగతం పలికారు. తర్వాత యల్లనూరురోడ్డు సర్కిల్‌, గాంధీసర్కిల్‌, ఆశోకపిల్లర్‌ మీదుగా కాన్వాయ్‌ ఇంటి వద్దకు చేరుకుంది. అక్కడి కాశాల మైదానంలో కార్యకర్తలు, అభిమానులకు జేసీపీఆర్‌ విందు ఏర్పాటుచేశారు. జేసీని కలిసిన వారిలో టీడీపీ సీనియర్‌ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, జగదీశ్వరరెడ్డి, ఎంఎ రంగారెడ్డి, చింబిలి వెంకటరమణ, హరినాథ్‌రెడ్డి, మాటాటి పవన్‌కుమార్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నరేంద్రనాయుడు, సుదర్శన్‌రెడ్డి, ఓబులేసుయాదవ్‌, ప్రసాద్‌యాదవ్‌, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

తరలిన టీడీపీ శ్రేణులు

పుట్లూరు: హైదరాబాద్‌ నుంచి తాడిపత్రికి వస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డికి స్వాగతం పలకడానికి మండలం నుంచి పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండల నాయకుడు చవ్వా బలరామిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 60వాహనాల్లో గుత్తి బాటసుంకులమ్మ ఆలయం వద్దకు తరలివెళ్లి స్వాగతం పలికారు. తరలివెళ్లిన వారిలో నాయకులు సత్యనారాయణ రెడ్డి, చెన్నారెడ్డి, బ్రహ్మయ్య, రవికుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు నాయుడు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి త్రైక్వాండో పోటీలకు ఎంపిక

తాడిపత్రి, అక్టోబరు 3: జిల్లాకేంద్రంలో ఈనెల 2న జరిగిన అండర్‌- 14, 17, 19 త్రైక్వాండో పోటీల్లో తాడిపత్రికి చెందిన నలుగురు క్రీడాకారులు గోల్డ్‌మెడల్‌ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్‌ కార్యదర్శి సాయిబాబా గురువారం తెలిపారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు.

స్మార్ట్‌ మీటర్ల ప్రక్రియను ఉపసంహరించుకోవాలి: సీపీఐ

రాయదుర్గం రూరల్‌, అక్టోబరు 3: వ్యవసాయానికి సంబంధించి విద్యుత్‌ మోటార్ల పంపుసెట్లకు స్మార్ట్‌ మీటర్లు బిగించే ప్రక్రియను ఉపసంహరించుకోవాలని సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున డిమాండ్‌ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యుత్‌ చార్జీలు విపరీతంగా పెంచి ప్రజలను మోయలేని భారం మోపించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదేరీతిలో పయనిస్తోందన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్‌చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, ఇప్పుడు పెంచే ఆలోచన చేయడం బాధాకరమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌ మోటార్ల విధానాన్ని రద్దు చేస్తామని చెప్పారని, ఇప్పుడు ఆ హామీకి ఎందుకు కట్టుబడటంలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌ మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్‌, రైతు సంఘం నాయకుడు తిప్పేస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, నరసింహులు, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై ఎంపీకి వినతి

గుంతకల్లు, అక్టోబరు 3: రైల్వే స్టేషన్‌, డివిజన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు టీడీపీ నాయకులు మున్సూరు భాస్కర్‌, ఐఓసీ ట్రైనింగ్‌ ఆఫీసర్‌ అబ్దుల్‌ గులాం నజీర్‌ వినతిపత్రాన్ని అందజేశారు. అమరావతిలో శుక్రవారం జరుగనున్న ప్రజా ప్రతినిధులు, రైల్వే జీఎం భేటీలో పాల్గొనడానికి ఎంపీ వెళుతూ గురువారం గుంతకల్లుకు వచ్చారు. ఈ సందర్భంగా భాస్కర్‌, అబ్దుల్‌ గులాం నజీర్‌ ఎంపీని కలసి సమస్యలను విన్నవించారు. అనంతపురం, గుంతకల్లు స్టేషన్లలో నిలపకుండా వెళ్తున్న రైళ్లను ఆగేలా చూడాలన్నారు. అలాగే పట్టణంలో రైల్వే వంతెనల సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి చేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

బొమ్మనహాళ్‌, అక్టోబరు 3 : మండల కేంద్రంలో బీజేపీ నాయకులు గురువారం పార్టీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. రాయదుర్గం అసెంబ్లీ కన్వీనర్‌ హరికేశరావు, స్థానిక యూత్‌ నాయకులతో కలిసి సభ్యత్వం ఇచ్చారు. ఈ సందర్భంగా హరికేశరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

గుత్తి, అక్టోబరు 3: మున్సిపల్‌ పరిధిలోని ప్రజలు ఇంటి, కొళాయి పన్నులు సకాలంలో చెల్లించాలని మున్సిపల్‌ కమిషనర్‌ జబ్బర్‌మియా కోరారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం ఆయన పర్యటించి వసూళ్ల విధానాన్ని పరిశీలించారు. ప్రజలు ఇంటి, కొళాయి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్‌ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పన్నులను వంద శాతం వసూలు చేయాలని సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. ఆర్‌ఓ షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

బొమ్మనహాళ్‌, అక్టోబరు 3: మండలంలోని ఓ గ్రామంలో 40 ఏళ్ల మహిళపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లైంగిక వేధింపులు గురిచేసినట్లు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగుచూసింది. మహిళను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొద్దిరోజులుగా లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. నిత్యం తన కోరిక తీర్చాలంటూ ఆమెను వేధించడంతో పాటు బెదిరిస్తున్నాడు. కొంతకాలంగా వేధింపులు మరింత తీవ్రం కావడంతో ఆమె తన భర్తతో కలిసి వారం క్రితం ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు గురువారం విలేకరులకు తెలిపారు. దీంతో ఆలస్యంగా కేసు నమోదుచేశారని పోలీసులపై విమర్శలు వచ్చాయి. కేసును తప్పుదోవ పట్టించేందుకు కొందరు ప్రయత్నించారని తెలిసింది. గ్రామంలో తీవ్ర చర్చ జరగడంతో పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

పంటల సాగులో మెలకువలు పాటించండి

● పొలం పిలుస్తోందిలో రైతులకు వ్యవసాయాధికారుల సూచన

యాడికి, అక్టోబరు3: పంటల సాగులో రైతులు మెలకువలను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చునని ఏఓ మహబూబ్‌ బాషా సూచించారు. మండలంలోని కోనుప్పలపాడు, ఓబులాపురం గ్రామాల్లో గురువారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. వ్యవసాయాధికారులు సూచించిన మెలకువలను పాటించాలని తెలిపారు. పత్తి పంటను పురుగులు ఆశించకుండా వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయ అధికారి రవికుమార్‌, పలువురు రైతులు పాల్గొన్నారు.



కోనుప్పలపాడులోని పొలం పిలుస్తోందిలో ఏఓ, రైతులు

పుట్లూరు: మండలంలోని సూరేపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఏడీఏ చెంగరాయుడు, ఏఓ కాత్యాయిని ముఖ్యఅతిథిగా పంటలను పరిశీలించారు. యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల నమోదుకు ప్రతిరైతు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. టీడీపీ నాయకులు వేణుగోపాల్‌నాయుడు, వెంకటనాయుడు, సదాశివ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్‌: మండలంలోని సంగాల, దోసులుడికి గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ స్వాతి మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వచ్చేలా వ్యవసాయం చేయాలని రైతులకు సూచించారు. పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. డ్రోన్‌ ద్వారా పురుగు మందుల పిచికారీ, ప్రత్యామ్నాయ పంటలు, ప్రకృతి వ్యవసాయం, పంటసాగులో తీసుకోవాల్సిన మెలకువలను రైతులకు ఆమె వివరించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని ఎన్‌ తిమ్మాపురం, గడేకల్లు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జొన్న, కంది పంటలను పరిశీలించారు. అనంతరం జొన్న పైరుకు సోకే తెగుళ్లను, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఏఓ హెచ్‌ పెన్నయ్య, ఏఈఓ రామవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

ఉరవకొండ, అక్టోబరు 3: రాయితీ విత్తన వేరుశనగ కోసం మండలంలోని రైతులు తమ తమ గ్రామాల్లోని రైతుసేవాకేంద్రాల వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని ఏవో ఓబుకోర్‌ తెలిపారు. రాకెట్ల రైతు సేవా కేంద్రంలో గురువారం ఆయన పేర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ విత్తన ధర క్వింటాకు రూ.9,400గానూ సబ్సిడీ పోనూ రైతు వాటా రూ.7,050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యల్లనూరు: మండలంలో విత్తన వేరుశనగ పంపిణీకి శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్‌ ప్రారంభమవుతుందని వ్యవసాయ అధికారి రామకృష్ణ తెలిపారు. యల్లనూరు, పాతపల్లి, జంగంపల్లి, వెన్నపూసపల్లి గ్రామాల్లోని రైతులకు మాత్రమే విత్తన వేరుశనగ ఇస్తామన్నారు. రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

పుట్లూరు: మండలంలో రైతులు విత్తన వేరుశనగ కోసం శుక్రవారం నుంచి రైతుసేవా కేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కాత్యాయిని తెలిపారు. మండలానికి 3400క్వింటాళ్ల విత్తనాలను కేటాయించినట్లు తెలిపారు.

తిరుపతికి వెళ్లి పింఛన్‌ అందజేత

పుట్లూరు, అక్టోబరు 3: మండలంలోని బాలాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు రమాదేవికి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు గురువారం తిరుపతిలో సామాజిక పింఛన్‌ను అందజేశారు. రమాదేవి తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో మానసిక చికిత్స విభాగంలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు అక్కడికి వెళ్లి ఆమెకు పింఛన్‌ను అందజేశారు.

కల్వర్టు మరమ్మతుకు చర్యలు

వెలుగుప్ప, అక్టోబరు 3: మండలంలోని ఎర్రగుడి గ్రామ శివారులో పెద్ద వంక కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతు పనులను టీడీపీ నాయకులు చేపడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు ధ్వంసమైంది. దీంతో రైతులు పొలాల్లోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి పయ్యావుల కేశవ్‌ ప్రజలకు ఇబ్బందిలేకుండా చూడాలని సూచించడంతో స్థానిక టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ రెండు రోజుల నుంచి కల్వర్టుకు మరమ్మతుకు చర్యలు చేపట్టారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లేలా మరమ్మతులు చేయిస్తున్నారు. నాయకులు యర్రిస్వామి, మారెప్ప, ప్రభాకర్‌, చిరంజీవి, రఘురాముడు, కోదండ రాజన్న, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

బ్రహ్మసముద్రం, అక్టోబరు 3: మండలంలోని చెలిమేపల్లి గ్రామానికి చెందిన టీ వన్నూరు స్వామి (28) అనే యువకుడు బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. వన్నూరుస్వామి కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే కొద్దిరోజులుగా ఆరోగ్యం బాగోకపోవడంతో పనులకు వెళ్లలేక రూ. 2 లక్షల దాకా అప్పులు చేశాడు. ఆరోగ్యం కుదుట పడక, అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో నిత్యం మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన అతను రాత్రి అందరూ పడుకున్నాక ఇంటి లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య అంబిక, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చేనేతతో సంపద తయారీ కేంద్రం పునఃప్రారంభం

వెలుగుప్ప, అక్టోబరు 3 : మండల కేంద్రం లో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని గురువారం పునఃప్రారంభించారు. టీడీపీ నాయకుడు మల్లికార్జున మాట్లాడుతూ చెత్తతో సంపద తయారీ కేంద్రాలు వైసీపీ పాలనలో నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. మళ్లీ ఇవ్వుడు తిరిగి ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. ఎంపీడీఓ రామచంద్ర, ఈఓఆర్డీ నాగేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

గుంతకల్లు టౌన్‌, అక్టోబరు 3: మండలంలోని పులగుట్టపల్లి పెద్దతండాలో బానావత్‌ రంగానాయక్‌పై అదే గ్రామానికి చెందిన మిట్టునాయక్‌, భాస్కర్‌ నాయక్‌, జ్యోతి గురువారం దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు రూరల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామంలో బానావత్‌ రంగానాయక్‌తో మిట్టునాయక్‌, భాస్కర్‌నాయక్‌, జ్యోతి పొలం విషయంలో గొడవ పడ్డారు. ఈ క్రమంలో వారు అతనిపై రాయితో దాడి చేశారు. తలకు బలమైన గాయమైంది. ఈ మేరకు బాధితుడు రూరల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

శిలాఫలకాల ధ్వంసం

కూడేరు, అక్టోబరు 3: మండలంలోని కమ్మూరు గ్రామంలో సచివాలయం, రైతుసేవాకేంద్రం, హెల్త్‌సెంటర్‌కు ఉన్న శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గత బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాలను పగులకొట్టినట్లు గ్రామ కార్యదర్శి వివేకానందరెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్‌ కమిటీ సభ్యుడిగా గోవిందు

పామిడి, అక్టోబరు 3: గుంతకల్లు రెవెన్యూ డివిజన్‌ పరిధిలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్‌ కమిటీ సభ్యుడిగా సాకే గోవిందు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సీపీఎం పోరాటాల ఫలితమే చెత్తపన్ను రద్దు

గుంతకల్లుటౌన్‌, అక్టోబరు 3: సీపీఎం పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్నును రద్దు చేసిందని సీపీఎం పట్టణ కార్యదర్శి బీ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. చెత్తపన్నును వ్యతిరేకంగా పాదయాత్ర, రిలే నిరాహార దీక్షలు, నిరవధిక నిరాహార దీక్షలు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చెత్త పన్ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఆ హామీ ప్రకారం చెత్త పన్ను రద్దు చేసిందని చెప్పారు.

క్వారీ తనిఖీ

డీ.హీరేహాళ్‌, అక్టోబరు 3: మండలంలోని హిర్దేహాళ్‌ గ్రామ సమీపంలో ఉన్న సాయిబాలాజీ వైట్‌ మెటల్‌ క్వారీని మైనింగ్‌, రెవెన్యూ అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఆ క్వారీ ద్వారా గ్రామానికి చాలా ఇబ్బందికరంగా ఉన్నదని పలువురు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్‌ వినోద్‌కుమార్‌ ఆదేశాల మేరకు మైనింగ్‌ టెక్నికల్‌ అసిస్టెంట్‌ రజని ఇతర అధికారులు క్వారీని తనిఖీ చేపట్టారు. ముందుగా క్వారీ వద్ద బ్లాస్టింగ్‌ చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడ ఎంత మేర బ్లాస్టింగ్‌ చేపడుతున్నారో పరిశీలించారు. అలాగే కంకరను పరిశీలించారు. తర్వాత పూర్తి నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు తెలియజేశారు.